# శ్రీ సి. జగన్నాధ రావు

శ్రీ జగన్నాధరావు అయిదవ శాసన సభ (1972-1978) డెప్యూటీ స్పీకర్‌గా 1972, మార్చి 28న ఏకగ్రీవంగా ఎన్నికై 1974 మార్చి 18 వరకు ఆ పదవిని నిర్వహించారు.

వీరు మెదక్ జిల్లా, నర్సాపూర్ గ్రామంలో 1932, మే 6న జన్మించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి బి. ఏ. మరియు లా డిగ్రీలను పూర్తి చేసినారు. న్యాయవాద వృత్తిని స్వీకరించి కొంత కాలము న్యాయవాదిగా కొనసాగారు.

వీరు 1947వ సంవత్సరములో నిజాం ప్రభుత్వమునకు వ్యతిరేకముగా 'క్విట్ హైదరాబాద్' ఉద్యమంలో చురుకుగా పాల్గొని 1948వ సంవత్సరములో జైలు శిక్షను అనుభవించారు.

వీరు 1959-1964 సంవత్సరములలో నర్సాపూర్ పంచాయితీ సమితి అధ్యక్షునిగా ఉన్నారు.

వీరు మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గం నుండి 1967వ సంవత్సరంలో మొదటిసారి రాష్ట్ర శాసనసభకు ఎన్నికైనారు. వీరు 1972 మరియు 1983 సంవత్సరాలలో కూడా నర్సాపూర్ నియోజకవర్గం నుండి ఎన్నికైనారు. వీరు 1972-1973, 1973-1974 సంవత్సరములలో అర్జీల, విశేషాధికారముల కమిటీల అధ్యక్షులుగా పనిచేశారు.

శ్రీ జగన్నాధరావు 1978 వ సంవత్సరంలో విధాన పరిషత్తు సభ్యునిగా ఎన్నికైనారు. వీరు శ్రీ టంగుటూరి అంజయ్య మంత్రి వర్గంలో ఆబ్కారి శాఖ మంత్రిగా, హోం మంత్రిగా ఉన్నారు. వీరు శ్రీ భవనం వెంకట్రాం మంత్రి వర్గంలో 1982, ఫిబ్రవరి 28 నుండి 1982, సెప్టెంబరు 20 వరకు ఉప ముఖ్యమంత్రిగా, హోం, పోలీసు, జైళ్లు మరియు రవాణా శాఖ మంత్రిగా ఉన్నారు. వీరు శ్రీ కోట్ల విజయభాస్కర రెడ్డి మంత్రి వర్గంలో 1982, సెప్టెంబరు 20 నుండి 1983, జనవరి 9 వరకు పరిశ్రమల శాఖ మంత్రిగా సమర్థవంతంగా పనిచేశారు.

## శ్రీ సి. జగన్నాథరావు డెప్యూటీ స్పీకరుగా ఎన్నికైన సందర్భంగా చేసిన ప్రసంగం.

అధ్యక్షా ! పెద్దలారా, స్నేహితులారా, చాలామంది మిత్రులు నా విషయమై చెప్పడం జరిగింది. ఈ సభలో నా కంటె అనుభవజ్ఞులు, పెద్దలు ఎంతో మంది ఉన్నప్పటికి నాకే ఈ అవకాశం ఇవ్వడం ముఖ్యమంత్రి గారు ఒక ఎక్స్‌పెరిమెంట్ చేస్తున్నారేమో అని నేను భావిస్తున్నాను. నేను మీ నాయకత్వంతోను మీ అనుభవంతోను లాభపడుతూ ఒకే మాట మనవి చేయదలచు కున్నాను. ప్రజాస్వామ్య సాంప్రదాయాల ప్రకారము నిష్పక్షపాతంగా మీ సలహా ప్రకారం ఈ సభాసదులందరికి అవకాశం కలుగచేస్తానని హామీ ఇస్తున్నాను. ఈ అవకాశం ఇచ్చిన పెద్దలకు మీకు నా హృదయపూర్వకమైన వందనములు తెలుపుతూ మరొకసారి ప్రజాస్వామిక సత్సాంప్రదాయాలను నిష్పక్షపాతంగా నిలబెడతానని హామీ ఇస్తూ సెలవు తీసుకుంటున్నాను. జైహింద్.